ఆదివారం

22-09-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 463 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM


SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD



మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..


Mundadugu whatsapp:
9491114616

email: mundadugu111@gmail.com


ముంబై లాల్ బాగ్చా గణపతికి కాసుల వర్షం

మిగతా 2లో




అమెరికాలో ఓయో కార్యకలాపాలు

మిగతా 2లో



పిల్లల భవిష్యత్తుకు ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం


మిగతా 3లో



ల్యాప్‌టాప్ ఒళ్లో పెట్టుకుంటున్నారా..

మిగతా 4లో

# జమ్మూకశ్మీర్‌లో హింసకు వారే కారణం



**ముందడుగు జమ్మూకశ్మీర్:**

జమ్మూలో మూడు కుటుంబాల (గాంధీ, ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా కుటుంబం) హింసను ప్రేరేపించాయని, ఆ మూడు పార్టీల( కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ) వారసత్వ రాజకీయాలకు ముగింపు పలకాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రజలకు పిలుపునిచ్చారు. జమ్మూకశ్మీర్‌లోని మెంధార్‌లో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈసందర్భంగా ప్రతిపక్ష పార్టీలపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు.

ఈ ఎన్నికలు గాంధీ, ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా అనే మూడు కుటుంబాల పాలనను అంతం చేయబోతున్నాయని అమిత్ షా పేర్కొన్నారు. ఈ మూడు కుటుంబాలే ఎన్నోఏళ్లుగా జమ్మూలో ప్రజాస్వామ్యాన్ని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి రాకపోతే, జమ్మూకశ్మీర్‌లో ఎప్పటికీ పంచాయతీ లేదా బ్లాక్ స్థాయి ఎన్నికలు జరిగేవి కావని అన్నారు.

"1990ల్లో ఇక్కడి సోదరులు ధైర్యసాహసాలతో బుల్లెట్లను ఎదుర్కొన్నారు. 1947 నుంచి పాకిస్థాన్‌తో జరుగుతున్న ప్రతీ యుద్ధంలో సైనికులు జమ్మూ సరిహద్దుల్లో ఉంటూ దేశాన్ని రక్షిస్తున్నారు" అని అమిత్‌షా సైనికుల త్యాగాలను కీర్తించారు.



## ఢిల్లీ సీఎంగా ఆతిశీ ప్రమాణ స్వీకారం

### హాజరైన ఆప్ అధినేత కేజ్రీవాల్

**ముందడుగు ఢిల్లీ:**

దేశ రాజధాని ఢిల్లీకి నూతన ముఖ్యమంత్రిగా ఆతిశీ ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం రాజ్ నివాస్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ హాజరయ్యారు.

మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొని, జైలుకు వెళ్లి ఇటీవలే విడుదలై వచ్చిన ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్.. సీఎం పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తదుపరి ముఖ్యమంత్రిగా ఆతిశీ పేరును ప్రతిపాదించగా.. ఆప్ ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా ఆమోదించారు.

మిగతా 2లో

## అమృత్ పథకంలో భారీ అవినీతి

- సీఎం బావమరిది కంపెనీకి రూ.1,137 కోట్ల పనులు
- బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపణ

**ముందడుగు హైదరాబాద్:**



తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పురపాలికల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూపొందించిన అమృత్ పథకంలో సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు అవినీతి చేశారని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు.

మిగతా 2లో

## హైదరాబాద్ మార్కెట్లో తగ్గిన ఇళ్ల విక్రయాలు

- ఏకంగా 42 శాతం మేర క్షీణత నమోదు
- హైడ్రా కూల్చివేతలు కూడా ఓ కారణమే



02

# ముంబై లాల్ బాగ్చా గణపతికి కాసుల వర్షం

## రూ.5.65 కోట్ల నగదు.. 4.15 కిలోల బంగారం



ముందడుగు ముంబై:

వినాయక చవితి వేడుకలు దేశవ్యాప్తంగా జరుగుతున్నప్పటికి దేశ ఆర్థిక రాజధాని ముంబైలో మాత్రం అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. ముంబై చవితి వేడుకలు మాత్రం ప్రత్యేకం. అందులోనూ ముఖ్యంగా ముంబైలో కొలువుదీరే లాల్ బాగ్చా రాజా గణపతి వెరీ స్పెషల్. సినీ, క్రీడా, రాజకీయ ప్రముఖులు సైతం లాల్ బాగ్చా రాజా దర్శనం కోసం క్యూలు కడతారంటే అర్థం చేసుకోవచ్చు.

ఫుల్ క్రేజ్ సంపాదించుకున్న లాల్ బాగ్చా రాజాకు కానుకలు సైతం అదే రేంజ్‌లో వస్తుంటాయి. లాల్ బాగ్చా రాజాపై భక్తులు డబ్బులు, బంగారం, వెండి వంటి కానుకల వర్షం కురిపిస్తారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా ప్రసిద్ధ లాల్ బాగ్చా రాజాకు భక్తులు భారీగా విరాళాలు సమర్పించినట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు వెల్లడించారు. మొత్తం తొమ్మిది రోజుల ఉత్సవాల్లో భాగంగా రూ.5.65 కోట్ల నగదు, 4.15 కిలోల బంగారం, 64 కిలోల వెండితో పాటు వివిధ రకాల వస్తువులు లాల్ బాగ్చా రాజాకు కానుకల రూపంలో వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా ఎలాంటి అవాంతరాలు లేకుండా సక్సెస్‌ఫుల్‌గా ముంబై లాల్ బాగ్చా రాజా ఉత్సవాలు ముగిసిట్లు పేర్కొన్నారు.

# ఢిల్లీ సిఎంగా ఆతిశీ ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అంగీకరించడంతో.. తాజాగా ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఆమెతో పాటు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ముకేశ్ అహ్లావత్, గోపాల్ రాయ్, ఇమ్రాన్ హుస్సేన్, కైలాశ్ గహ్లోత్, సౌరభ్ భరద్వాజ్ కేబినెట్ మంత్రులు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ముందు వారంతా కేజ్రీవాల్‌ను కలిశారు.

# అమృత్ పథకంలో భారీ అవినీతి



(మొదటిపేజీ తరువాయి)

సీఎం తన అధికారాన్ని ఉపయోగించి బావమరిదికి పనులు అప్పగించారని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.
"సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది కంపెనీకి రూ.1,137 కోట్ల పనులు అప్పగించారు. రూ.2 కోట్ల లాభం ఉన్న కంపెనీ రూ.1000 కోట్ల విలువైన పనులు చేస్తుందా? అమృత్ పథకంలో జరిగిన టెండర్ల వివరాలను ప్రభుత్వం బయటపెట్టడం లేదు. టెండర్లపై కేంద్రం విచారణ జరిపించాలి. ఇప్పటి వరకు జరిగిన అమృత్ పథకం టెండర్లను రద్దు చేయాలి. ఈ టెండర్ల అవినీతిపై కేంద్రానికి లేఖ రాశాం. ప్రభుత్వం చేసిన అక్రమాలన్నీ బయటపెడతాం" అని కేటీఆర్ అన్నారు.

# అమెరికాలో ఓయో కార్యకలాపాలు

## ప్రముఖ లాడ్జింగ్ ఫ్రాంఛైజీలు కొనుగోలు




ముందడుగు జాతీయం:

ప్రముఖ దేశీయ యూనికార్న్ సంస్థ ఓయో.. అమెరికాలో తన సేవా కార్యకలాపాలను విస్తరించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా అమెరికాకు చెందిన ప్రముఖ లాడ్జింగ్ ఫ్రాంఛైజీ, మోటల్ 6, స్టూడియో 6 బ్రాండ్లను నడుపుతున్న జీ6 హాస్పిటాలిటీ సంస్థను కొనుగోలు చేయనుంది. బ్లాక్ స్టోన్ రియల్ ఎస్టేట్ కంపెనీ నుంచి 525 మిలియన్ డాలర్లకు దీన్ని కొనుగోలు చేయనున్నట్లు ఓయో మాతృ సంస్థ ఓర్వల్ స్టేస్ శనివారం ప్రకటించింది. పూర్తి నగదు రూపంలో ఈ లావాదేవీ జరగనుంది. భారత్‌లోని ప్రధాన నగరాల్లో సేవలందిస్తున్న ఓయో.. అమెరికాలో 2019లో అడుగుపెట్టింది. ప్రస్తుతం 35 రాష్ట్రాల్లో 320కి పైగా హోటళ్లను నిర్వహిస్తోంది. గతేడాది 100 హోటళ్లను చేర్చుకుంది. ఈ ఏడాది మరో 250 హోటళ్లను తన పోర్ట్‌ఫోలియోలో చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో మోటల్ 6, స్టూడియో 6 బ్రాండ్ల కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఓయో ప్రకటించడం గమనార్హం. 2024 నాలుగో త్రైమాసికానికి కొనుగోలు పూర్తవుతుందని అంచనా వేస్తున్నట్లు ఓయో తెలిపింది.

# హైదరాబాద్ మార్కెట్లో తగ్గిన ఇళ్ల విక్రయాలు

ముందడుగు హైదరాబాద్:

అత్యంత వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరంలో ఇళ్ల విక్రయాలు భారీగా పడిపోయాయి. ఈ సమయంలో ఏకంగా 42 శాతం మేర క్షీణత నమోదుకానుందని అంచనా వేసింది. రియల్ ఎస్టేట్ సేవల సంస్థ ప్రాప్ ఈక్విటీ. గతంతో పోలిస్తే ఈసారి భారీగా పడిపోనున్నాయని తెలిపింది. జులై సెప్టెంబర్ త్రైమాసికంలో హైదరాబాద్ మార్కెట్‌లో ఇళ్ల విక్రయాలు 12,082 యూనిట్లు ఉండొచ్చని ప్రాప్ ఈక్విటీ నివేదిక తెలిపింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో హైదరాబాద్‌లో ఇళ్ల విక్రయాలు 20,658 యూనిట్లుగా నమోదైనట్లు తెలిపింది. గతేడాది గణాంకాలతో పోలిస్తే ఈసారి ఏకంగ 42 శాతం విక్రయాలు పడిపోనున్నాయని అంచనా వేసింది. ఈ క్రమంలో పలు విషయాలు చర్చకు వస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతలు జరుగుతున్నాయి. చెరువులను కబ్జా చేసి కట్టిన ఇళ్లపై తెలంగాణ ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. వరుసపెట్టి కూల్చివేతలు



చేపడుతోంది. ఇది కూడం ఇళ్ల విక్రయాలపై ప్రభావం చూపుతోందని రియల్ ఎస్టేట్ మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మరి కొన్నాళ్ల పాటు హైడ్రా గుబులు ప్రజల్లో ఉంటుందంటున్నారు. దీంతో ఇల్లు కొనేందుకు వెనకడుగు వేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

దేశవ్యాప్తంగా 9 ప్రధాన నగరాల్లో జులై సెప్టెంబర్ త్రైమాసికంలో ఇళ్ల విక్రయాలు 18 శాతం మేర పడిపోయినట్లు ప్రాప్ ఈక్విటీ నివేదిక తెలిపింది. ఈ సమయంలో మొత్తం 1,04,393 యూనిట్లు నమోదు కావచ్చని పేర్కొంది. గతేడాది ఇదే సమయంలో 1,26,848 యూనిట్లు విక్రయమైనట్లు పేర్కొంది. నగరాల వారీగా చూస్తే ఢిల్లీలో 22 శాతం, నవీ ముంబైలో 4 శాతం వృద్ధి నమోదు కావచ్చని తెలిపింది. ఇక బెంగళూరులో 26 శాతం పడిపోయి 13,355 యూనిట్ల విక్రయాలు జరిగే అవకాశం ఉందని తెలిపింది. గత ఏడాదిలో సిలికాన్ సిటీలో 17,978 యూనిట్ల విక్రయాలు జరిగినట్లు తెలిపింది. ఇక చెన్నైలో 18 శాతం క్షీణించి 4,634 యూనిట్ల విక్రయాలు జరగొచ్చు. కోల్‌కతాలో 23 శాతం పడిపోయే అవకాశం ఉందని తెలిపింది. పుణె నగరంలో 19 శాతం, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లో 10 శాతం తగ్గే అవకాశం ఉందని తెలిపింది.

ముందడుగు
ఆదివారం,
22-09-2024,
హైదరాబాద్

### తెలంగాణలో

# యథా రాజా తథా పోలీసులు

## సీనియర్ పోలీస్ అధికారులు కష్టమంతా వృథా

### మాజీ మంత్రి హరీశ్ రావు ఆందోళన



ముందడుగు హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్రంలో సీనియర్ పోలీస్ అధికారులు పడిన కష్టమంతా వృథా అవుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు పోలీసు అధికారులకు సంబంధించి అవినీతి ఆరోపణలపై వచ్చిన కథనాలపై ఎక్స్ వేదికగా స్పందించారు. యువ అఖిల భారత సర్వీస్ అధికారులకు ప్రభుత్వాలు ఆదర్శంగా ఉండి, వాళ్లకి పని పట్ల నిబద్ధత, ప్రజా సేవ పట్ల అంకితభావాన్ని నేర్పించాలన్నారు. కానీ 'యథా రాజా తథా పోలీసులు' అన్నట్లు రాష్ట్రంలో పరిస్థితి తయారైందని వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆలోచనలతో గత పదేళ్లలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దామని, ఆ ప్రక్రియలో ఎందరో తెలంగాణ సీనియర్ ఐపీఎస్ పోలీస్ అధికారుల పాత్ర కచ్చితంగా ఉందన్నారు. అలాంటి తెలంగాణ రాష్ట్ర పోలీస్ బ్రాండ్‌కు కొందరి తీరు కారణంగా అవినీతి మకిలి పడితే పోలీస్ అధికారులు పడ్డ కష్టమంతా వృథా అవుతుందన్నారు. ఒక్కసారి ఈ విషయాన్ని తెలంగాణ సీనియర్ పోలీస్ అధికారులు పునరాలోచించి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి సూచించారు.

# పిల్లల భవిష్యత్తుకు ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం


## తొలిరోజే 10 వేల మంది పిల్లల పేర్లు నమోదు.. ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం ప్రయోజనాలివే

ముందడుగు ప్రత్యేకం:

కేంద్రప్రభుత్వం పిల్లలకు ఆర్థిక భరోసా కల్పించేలా సరికొత్త పథకాన్ని తీసుకొచ్చింది. ఆ పథకమే ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం. ఈ కొత్త పథకాన్ని సెప్టెంబర్ 18, 2024 రోజున కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ పథకాన్ని అనూహ్యమైన స్పందన లభిస్తోంది. మల్టిపుల్ బెనిఫిట్స్ అందిస్తున్న క్రమంలో ఈ పథకంలో తమ పిల్లలను చేర్పించేందుకు ఎగబడుతున్నారు. ఈ పథకం ప్రారంభించిన తొలిరోజే దాదాపు 10 వేల మంది పిల్లల పేర్లను నమోదు చేశారు. ఇంతలా డిమాండ్ ఉండేందుకు గల కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. ఎన్‌పీఎస్ వాత్సల్య స్కీమ్ ప్రారంభించిన తొలి రోజే ఏకంగా 9705 మంది మైనర్లు సబ్‌స్క్రైబ్ చేసుకున్నట్లు పెన్షన్ రెగ్యులేటరీ సంస్థ పీఎఫ్ఆర్‌డీఏ ఓ ప్రకటనలో తెలిపింది. అందులో ఇఎన్‌పీఎస్ పోర్టల్ ద్వారానే 2,197 ఖాతాలు తెరిచినట్లు వెల్లడించింది. ప్రజల నుంచి భారీ స్పందన లభిస్తున్నట్లు పేర్కొంది. ముందు ముందు ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతాలు తెరిచే వారి సంఖ్య గణనీయంగా పెరగనుందని అంచనా వేసింది.

### ఎన్‌పీఎస్ వాత్సల్య ప్రయోజనాలివే..

18 సంవత్సరాల లోపు వయసు ఉండే పిల్లల పేరుపై ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతా తెరిచి పెట్టుబడి కొనసాగించవచ్చు. వారి పేరిట ఆధార్ కార్డు, పాన్ కార్డు ఉండాలి. ఈ పథకంలో ఏడాదికి కనీసం రూ.1000 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఎంతైనా ఇన్వెస్ట్ చేయవచ్చు. తల్లిదండ్రులు లేదా సంరక్షకులు పిల్లల పేరిట ఈ ఖాతాలో ఇన్వెస్ట్ చేస్తూ ఉండాలి. పిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత ఎన్‌పీఎస్ వాత్సల్య అకౌంట్ సాధారణ ఎన్‌పీఎస్ అకౌంట్‌గా మారుతుంది. అప్పుడు అవసరమైన కేవైసీ డాక్యుమెంట్లు ఇవ్వాలి. ఈ పథకంలో మూడేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. ఆ తర్వాత 25 శాతం పెట్టుబడిని విత్ డ్రా చేసుకోవచ్చు. విద్య, వైద్య ఖర్చుల కోసం వీటిని ఉపసంహరించుకోవచ్చు. అయితే, 3 సార్లు మాత్రమే విత్ డ్రా చేసుకోనేందుకు అవకాశం కల్పించారు.




### బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఖాతా తెరవవచ్చు


పిల్లల డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, గార్డియెన్ లేదా తల్లిదండ్రుల కేవైసీ డాక్యుమెంట్లు అంటే అడ్రస్, గుర్తింపు కార్డులు అవసరం అవుతాయి. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఈ ఖాతా తెరవవచ్చు. లేదా ఇఎన్‌పీఎస్ పోర్టల్ ద్వారా ఖాతా తెరిచేందుకు అవకాశం కల్పించారు. ఇప్పటికే 7 బ్యాంకులు ఎన్‌పీఎస్ వాత్సల్య స్కీమ్ ఖాతాలు తెరిచేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. ఇందులో అప్పుడే పుట్టిన పాప పేరుపై ఏడాదికి రూ.10 వేల చొప్పున పెట్టుబడి కొనసాగించారు అనుకుందాం. సగటున 12.86 శాతం రాబడి అంచనా వేస్తే.. 18 ఏళ్లు వచ్చే నాటికి మొత్తం చేతికి రూ.8 లక్షలు అందుతాయి. ఇందులో 20 శాతం రూ.1.69 లక్షలు తీసుకోవచ్చు. 80 శాతం యాన్యుటీ స్కీమ్ కొనుగోలు చేయాలి.

# ఓటరు జాబితాలో పేరు తొలగించారని ఫిర్యాదు

## విచారణకు ఫిర్యాదుదారుడి ఇంటికి వెళ్లిన కలెక్టర్

ముందడుగు జగిత్యాల:


తన పేరును ఓటర్ లిస్టు నుంచి తొలగించారని ఓ వ్యక్తి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన ఫిర్యాదుదారుడి ఇంటికే నేరుగా కలెక్టర్ వెళ్లారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలో జరిగింది. ఓటర్ లిస్టులో తన పేరును తొలగించారని నవీన్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఏకంగా ఫిర్యాదుదారుని ఇంటికి స్వయంగా వెళ్లిన జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ విచారించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో ఇటీవల గ్రామ పంచాయతీలలో ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారులు ప్రదర్శించారు. అధికారుల ప్రదర్శించిన లిస్టులో తమ పేరు తొలగించారని కలెక్టర్ కు ఫిర్యాదు చేశాడు. గ్రామంలోని ఇద్దరి పేరు ఒకే విధంగా ఉండడంతో పొరపాటు జరిగిందని కలెక్టర్ కు బూత్



లెవెల్ అధికారి వివరించారు .దీంతో వెంటనే తప్పును సరి చేసి బింగి నవీన్ పేరు ఓటర్ జాబితాలో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

### చర్లపల్లి జైలు సూపరింటెండెంట్

# సంతోశ్ రాయ్ బదిలీ




ముందడుగు హైదరాబాద్:

హైదరాబాద్ చర్లపల్లి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తున్న సంతోష్ రాయ్ ను బదిలీ చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సంతోష్ రాయ్ సంగారెడ్డి జైలు సూపరింటెండెంట్ గా బదిలీ చేశారు. సంగారెడ్డిలో పనిచేస్తున్న రామచంద్రరావును చర్లపల్లి జైలు బాధ్యతలు అప్పగించారు. సంతోష్ రాయ్ ఆకస్మిక బదిలీకి పలు ఆరోపణలు, ఫిర్యాదులు ఉన్నట్లు సమాచారం.

ముందడుగు
ఆదివారం, 22-09-2024, హైదరాబాద్



# ల్యాప్‌టాప్ ఒళ్లో పెట్టుకుంటున్నారా..

## ఐతే మీకు ఈ సమస్యలు తప్పవు.. సంతానలేమికి ప్రధాన కారణం

ముందడుగు ఆరోగ్యం:

మనిషి జీవితం బిజిబిజీగా మారుతోంది. వారి జీవితానికి తగ్గట్లుగానే చెడు ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడంతో చాలా మంది అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. అలాగే తెలిసీ తెలియక చేసే కొన్ని పొరపాట్లు సంతాన లేమి సమస్యలకు కారణం అవుతున్నాయి. ముఖ్యంగా కంప్యూటర్, ల్యాప్‌టాప్‌పై ఎక్కువగా పనిచేసే వారికి ఫెర్టిలిటీ ప్రాబ్లమ్స్ ఎక్కువగా వస్తున్నాయి. 30 ఏళ్ల వయసు పైబడిన వారిలో ఈ సమస్య మరింత తీవ్రంగా మారింది. సంతాన లేమి సమస్యకు కారణమవుతుందని వైద్యులు చెపుతున్నారు.

### ఒడిలో పెట్టుకుంటే ఈ ప్రమాదం

ల్యాప్‌టాప్‌లను ఎక్కువసేపు ఒడిలో పెట్టుకొని ఉపయోగించడం వల్ల పురుషుల సంతానోత్పత్తిపై హానికరమైన ప్రభావం చూపుతుంది. ల్యాప్‌టాప్‌లు, సెల్ ఫోన్లు విద్యుదయస్కాంత క్షేత్రాలను విడుదల చేస్తాయి. ఇది క్రమంగా డీఎన్ఏ దెబ్బతినడానికి, స్పెర్మ్ క్వాలిటీని తగ్గించడానికి దారితీస్తుంది. ల్యాప్‌టాప్‌ను ఒడిలో పెట్టుకొని వాడితే స్క్రోటల్ టెంపరేచర్ పెరుగుతుంది. దీనివల్ల స్పెర్మాటోజెనిసిస్‌కు ఆటంకం ఏర్పడుతుంది. ఇది స్పెర్మ్ కౌంట్, శుక్ర కణాల చలనశీలతను తగ్గిస్తుంది. ఇది సంతాన లేమి సమస్యకు దారి తీస్తుంది.

### పరిష్కార మార్గాలివే..!

పురుషులు సంతాన లేమి సమస్య నుంచి బయటపడేందుకు వారి అలవాట్లు, జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. ల్యాప్‌టాప్‌లను నేరుగా ఒడిలో పెట్టుకోకుండా డెస్క్‌పై ఉంచి వాడాలి. శరీరాన్ని చల్లబరచడానికి తరచుగా విరామాలు తీసుకోవాలి. జింక్, ఫోలేట్, జిన్సెంగ్ వంటి ఖనిజాలతో పాటు బి12, డి3 వంటి కీలక విటమిన్లు లభించే ఆహార పదార్థాలు తినాలి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడికి చెక్ పెడతాయి. డీఎన్ఏ దెబ్బతినకుండా, స్పెర్మ్ క్వాలిటీని రక్షిస్తాయి.

### పునరుత్పత్తి వ్యవస్థపై ప్రభావం

ఇటీవలి కాలంలో సంతాన లేమి సమస్య తీవ్రంగా మారింది. నివేదికల ప్రకారం.. దాదాపు 15-20% మంది యువ జంటలు తల్లిదండ్రులు కాలేకపోతున్నారు. 2005 నాటి అధ్యయనాల ప్రకారం.. ల్యాప్‌టాప్, సెల్ ఫోన్ల వినియోగంలో పెరుగుదల ఈ సమస్యకు ఆజ్యం పోసింది. 30 ఏళ్లు పైడిన పురుషులు, కొత్తగా వివాహం చేసుకున్న జంటలు వారి రోజువారీ అలవాట్ల చిన్న చిన్న మార్పులు చేసుకోవాలి. ఆహారం, ఆరోగ్యం విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగాన్ని తగ్గించాలి. ఎక్కువసేపు ల్యాప్‌టాప్ వినియోగించడం వల్ల జరిగే నష్టాల గురించి తెలుసుకోవాలి.

ముందడుగు
ఆదివారం,
22-09-2024,
హైదరాబాద్

# ఆ బాధ్యత వారిదే!

మహిళల పట్ల అకృత్యాలు, లైంగిక వేధింపులు.. సినిమా ఇండస్ట్రీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఆ వుడ్, ఈ వుడ్ అని కాదు.. ఇప్పుడు అన్ని భాషల చిత్ర పరిశ్రమల్లోనూ ఈ తరహా ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఈ క్రమంలో బాలీవుడ్ నటి కృతిక కమ్రా సోషల్‌మీడియా వేదికగా ఓ విజ్ఞప్తి చేశారు. పరిశ్రమను కుదిపేస్తున్న క్యాస్టింగ్ కౌచ్, లైంగిక వేధింపులు లాంటి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత.. పరిశ్రమలోని మగవాళ్లదేనని చెప్పారు. ముందుగా వారివారి సినిమా షూటింగ్స్‌పై దృష్టి పెట్టాలనీ, అందులో పాల్గొంటున్న మహిళల స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని కోరారు.

మహిళా నటులు, ఇతర సాంకేతిక సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల గురించి వాకబు చేసి.. కావాల్సిన సాయం అందించాలన్నారు. పని ప్రదేశం ప్రొఫెషనల్‌గా ఉండేలా చూసుకోవాలనీ, షూటింగ్ స్పాట్ల దగ్గర ఇష్టారీతిన మాట్లాడటం, మహిళలపై అసభ్యకరమైన జోకులు వేయడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. 'ఒకరిని పొగడటానికి.. వారిని ఆక్షేపించడానికి మధ్య ఎంతో తేడా ఉంది. ఆ హద్దును దాటకుండా.. మహిళలతో మాట్లాడగలిగితేనే సమాజంలో నిజమైన మార్పు వస్తుంది' అని చెప్పారు కృతిక. టెలివిజన్, ఓటీటీ షోల ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నది కృతిక. హుష్ హుష్ మొదలుకొని బొంబై మేరీ జాన్ వరకు.. వైవిధ్యమైన పాత్రల ద్వారా తన నటనా నైపుణ్యాన్ని నిరూపించుకున్నది.





# ఏదో ఫ్రెండ్‌షిప్ కొద్దీ..

అంచనాలకు మించి పెళ్లి వేడుకలు నిర్వహించడం.. అంబానీల ఆనవాయితీ! అనంత్ అంబానీ – రాధికా మర్చంట్ వివాహ సంబురం ముగిసి అప్పడే మూడు నెలలు కావస్తున్నది. అయినా.. ఆ వేడుక గురించి ఇప్పటికీ సామాజిక మాధ్యమాల్లో చర్చ జరుగుతూనే ఉన్నది. తాజాగా.. ఈ పెళ్లికి హాజరైన బాలీవుడ్ ప్రముఖుల గురించిన ఓ వార్త తెగ వైరల్ అవుతున్నది.

అంబానీ ఆతిథ్యం స్వీకరించడానికి, వారి పెళ్లి బరాత్‌తో స్టెప్పులేయడానికి కొందరు బాలీవుడ్ తారలు పెద్ద మొత్తంలో డబ్బులు పుచ్చుకున్నారన్నది ఆ వార్త సారాంశం. అయితే.. ఈ అంశంపై బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే సోషల్‌మీడియా వేదికగా స్పందించింది. అనంత్‌తోపాటు రాధికా మర్చంట్ కూడా తనకు ఎంతో ప్రియమైన స్నేహితులనీ, అందుకే.. ఆ హైప్రొఫైల్ పెళ్లికి హాజరయ్యాననీ చెప్పుకొచ్చింది. అంబానీ పెళ్లి బరాత్‌లో పలువురు సెలెబ్రిటీలతో కలిసి అనన్య స్టెప్పులేసింది.

రణ్‌వీర్ సింగ్, అర్జున్ కపూర్‌తో కలిసి డ్యాన్స్‌లతో అలరించింది. తాజా పుకార్లపై స్పందిస్తూ.. "ఆ దంపతులిద్దరూ నా స్నేహితులు. సహజంగానే.. నా స్నేహితుల పెళ్లిలో నేను డ్యాన్స్ చేస్తాను. నా ప్రేమను ఇలా పంచుకోవడం నాకు ఇష్టం!" అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం అనన్య పాండే నటించిన వెబ్‌సిరీస్ 'కాల్ మీ బే'.. రికార్డు స్ట్రీమింగ్ నమోదు చేసుకుంటున్నది.